

మణుగూరులో రాస్తారోకో చేస్తున్న రేగా కాంతారావు, బీఆర్‌ఎస్ నేతలు

# 'సస్పెన్షన్'పై సమరం

## గులాబీ శ్రేణుల నిరసన గళం



పోలీసు వాహనంలోంచి నినాదాలు చేస్తున్న రేగా



పోలీసు వాహనంలో దిండిగాల

ప్రజా సమస్యలపై గొంగెత్తితే ఆ గొంతును నొక్కే ప్రయత్నం చేస్తున్నది కాంగ్రెస్ సర్కారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రజల తరఫున మాట్లాడేందుకు సిద్ధమైన మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై అకారణంగా సస్పెన్షన్ వేటు వేసింది. ప్రభుత్వాన్ని నడిపే దమ్ము, ధైర్యం కాంగ్రెస్‌కు లేకనే.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నేతలను టార్గెట్ చేస్తూ దుర్మార్గంగా ప్రవర్తించడంపై బీఆర్‌ఎస్ శ్రేణులు భగ్గుమన్నారు. వెంటనే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ధర్నాలు, నిరసనలు, దిష్టి బొమ్మ దహనం కార్యక్రమాలు చేపట్టారు.

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ శ్రేణుల ధర్నాలు, ఆందోళనలు
- మణుగూరులో ప్రధాన రహదారిపై బీఆర్‌ఎస్ 'రేగా' రాస్తారోకో
- ఇల్లెందులో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనానికి 'దిండిగాల' యత్నం
- అడ్డుకొని నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

## సర్కారుకు ధైర్యం లేకనే సస్పెన్షన్

### బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరు టౌన్, మార్చి 14: కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ము, ధైర్యం లేకనే ప్రశ్నించిన గొంతు కను అడ్డుకునేందుకు ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేసి దుశ్చర్యలకు పాల్పడుతున్నదని బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. గురువారం అసెంబ్లీలో జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ రేగా కాంతారావు ఆధ్వర్యంలో శుక్రవారం మణుగూరు పట్టణంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాటలను వక్రీకరిస్తూ.. బడ్జెట్ సమావేశాల్లో సమాధానం చెప్పలేక ఏదో కొర్రీలు పెట్టడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతుందన్నారు. కాంగ్రెస్‌పై వ్యతిరేకతతో వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని, సీఎం కేసీఆర్ కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, యాదగిరి గౌడ్, ముద్దంగుల కృష్ణ, ఆవుల నరసింహారావు, ఎడ్ల శ్రీనివాస్, అక్కి నరసింహారావు, దర్శనాల శ్రీనివాస్, కాటిబోయిన సుజాత, ఏనిక ప్రసాద్, వల్లభనేని రమణ, వడ్లూరి రాంబాబు, బర్ల సురేశ్, తురక రాంకోటి, ఉప్పుతల రామారావు, రమేశ్, రుద్రం, వెంకట్, కోటి, లక్ష్మణ్, రవి, జావీద్, సృజన్, జ్యోతి, మాధవి, మణెమ్మ పాల్గొన్నారు.






మణుగూరులో రేగా కాంతారావును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

## ఇల్లెందులో బీఆర్‌ఎస్ శ్రేణుల అరెస్ట్

### ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అరెస్టులా?: దిండిగాల

ఇల్లెందు, మార్చి 14: మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో ఇల్లెందు పట్టణంలోని జగదాంబ సెంటర్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శుక్రవారం పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకొని రాజేందర్‌తోపాటు ఉద్యమ నాయకులు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ బావ్‌సింగ్, ఆదూరి రవిలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో పోలీసుల చర్యను నిరసిస్తూ బీఆర్‌ఎస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించారు. ఠాణా ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దిండిగాల రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టీబీజీకేఎస్ నాయకుడు రంగనాథ్ మాట్లాడుతూ ప్రశ్నించే గొంతు నొక్కినంత మాత్రాన పోరాటం ఆగదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, పార్టీ సోషల్ మీడియా విభాగం, యూత్ నాయకుడు ఎంటెక్ మహేందర్, కాసాని హరిప్రసాద్, లలిత్ పాసి, సత్తాల హరికృష్ణ, నాయకులు సురేశ్, చాంద్‌పాషా, నారపాక వసంత, మునిగంటి శివ తదితరులు పాల్గొన్నారు.



ఇల్లెందు పోలీసు స్టేషన్ ఎదుట దిండిగాల రాజేందర్, బీఆర్‌ఎస్ నాయకులు

## ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా?: ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు

మధిర, మార్చి 14: ఆరు గ్యారెంటీలపై ప్రశ్నించినందుకే ఉద్దేశపూర్వకంగా జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేశారని, ఇది అత్యంత దారుణమైన విషయమని ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ మధిర పట్టణంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్ ద్వారా అమలు చేయని ఆరు హామీలను అమలు చేసినట్లుగా చెప్పించిందని, దీనిపై ప్రశ్నించినందుకే మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకులు బొగ్గుల భాస్కర్ రెడ్డి, అరిగె శ్రీనివాసరావు, కటికల సత్యనారాయణరెడ్డి, యన్నంశెట్టి వెంకట అప్పారావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, షేక్ ఖాదర్, వేమిరెడ్డి పెదనాగిరెడ్డి, పల్లపాటి కోటేశ్వరరావు, ఆళ్ల నాగబాబు, పరిస శ్రీనివాసరావు, చీదిరాల రాంబాబు, కొత్తపల్లి నరసింహారావు, షేక సైదా, అబ్దుల్ ఖురేషి, కోట కోటేశ్వరరావు, వీరంశెట్టి సీతారామయ్య, కాకుమాను కృష్ణమూర్తి, కప్పగంతుల పట్టాభిరామకృష్ణ, బత్తుల శ్రీనివాసరావు, ఆవుల గోపి, సంపసాల కొండ, ఒరుగంటి విజయ్, షేక్ జాన్‌సైదా, షేక్ మౌలాలి పాల్గొన్నారు.



మధిరలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

ఈ వేసవిలో విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు జిల్లా విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసచారి వెల్లడించారు. సాధారణ వినియోగదారులతోపాటు చిన్నతరహా, భారీ పరిశ్రమలు, వ్యవసాయరంగానికి ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను కొనసాగించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఖమ్మంజిల్లాలో విద్యుత్ సరఫరా, డిమాండ్, వినియోగదారులకు అందిస్తున్న సేవలు, ఈ వేసవి సీజన్‌లో తీసుకునే చర్యలపై శుక్రవారం ఆయన 'నమస్తే తెలంగాణ ప్రతినిధి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. –ఖమ్మం, మార్చి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

# విద్యుత్ కోతలుండవు



- ఈ వేసవిలో నిరంతర సరఫరాకు ప్రత్యేక ప్రణాళిక
- అత్యవసర సేవలకు ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం
- వ్యవసాయ కొత్త కనెక్షన్ల కోసం 1,434 దరఖాస్తులు
- సీనియారిటీ ప్రాతిపదికన కనెక్షన్లు ఇస్తాం..
- 'నమస్తే'తో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి

**ప్రశ్న: వేసవిలో విద్యుత్ కోతలకు అవకాశం ఉందా?**

**జవాబు:** ఎట్టి పరిస్థితుల్లో ఈ వేసవికాలంలో విద్యుత్ కోతలు విధించే అవకాశం లేదు. డిమాండ్‌కు తగినంత విద్యుత్ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇందుకు సంబంధించి ఇప్పటికే డిమాండ్, సరఫరాకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాం. నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఇబ్బందిలేదు. ప్రత్యేక పరిస్థితుల్లో ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, బ్రేక్‌డౌన్లు ఉంటే తప్ప విద్యుత్‌కు అంతరాయం ఉండదు.

**ప్రశ్న: ఓవర్‌లోడు సమస్యను ఎలా అధిగమిస్తారు?**

**జవాబు:** ఖమ్మం జిల్లాలో ఓవరు లోడ్ సమస్యను ఇప్పటికే గుర్తించాం. ఓవరు లోడు ఉన్నచోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను, అవసరం ఉన్నచోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను పెడుతున్నాం. పెరిగిన లోడ్‌కు తట్టుకోవడానికి అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయిని పెంచుతున్నాం. జిల్లాలో ఓవరు లోడు వల్ల ఇబ్బందులు కలగకుండా ఇప్పటికే అనేక చర్యలు తీసుకున్నాం.

**ప్రశ్న: కొత్త లైన్ల నిర్మాణం ఎంతవరకు వచ్చింది?**

**జవాబు:** ఖమ్మం జిల్లాలో 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో 36 కొత్త లైన్లు నిర్మించాల్సిన అవసరం ఉందని ప్రతిపాదించాం. ఇందులో ఇప్పటికే 9 లైన్ల నిర్మాణం పూర్తయింది. 11కేవీలో 150 యాంప్స్ మించిన వాటికి లైన్లు విడదీసి కొత్త లైన్లు వేశాం. ఓవరు లోడు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను మూడు రకాలుగా విభజించి గుర్తించాం. 100శాతం లోడు, 80శాతం లోడు, 60శాతం లోడు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి వాటి స్థానంలో కొత్తవి లేదా అదనపు సామర్థ్యం కలిగినవి ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 767 ఓవరు లోడు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి 191 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం. 75 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాం.

**ప్రశ్న: విద్యుత్ అంతరాయం సమయంలో తక్షణం తీసుకునే చర్యలేమిటి?**

**జవాబు:** ఏ కారణంచేతైనా ఇళ్లలో విద్యుత్‌కు అంతరాయం కలిగితే ఆ ప్రాంతంలో ఉన్న సిబ్బందితోపాటు ప్రత్యేకంగా జిల్లాలో మూడు ప్రాంతాల్లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాన్ని ఏర్పాటు చేశాం. ఈ బృందానికి ప్రత్యేక వాహనంతోపాటు విద్యుత్‌కు సంబంధించిన పూర్తి మెటీరియల్ అందుబాటులో ఉంచాం. విద్యుత్ అంతరాయం కలిగిందని సమాచారం వచ్చిన క్షణాల్లో ఈ బృందం అక్కడ ఉండి మరమ్మతులు చేపడుతుంది. ప్రస్తుతం ఖమ్మం, మధిర, వైరాలో ఈ బృందాలు పని చేస్తున్నాయి.

**ప్రశ్న: జిల్లాలో విద్యుత్ వినియోగం, డిమాండ్ ఎంత?**

**జవాబు:** ఖమ్మం జిల్లా విద్యుత్ వినియోగం రోజువారీ వినియోగం కోటా 6.96 మిలియన్ యూనిట్లు. ప్రస్తుతం 9.9 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నాం. ఈ వేసవిలో రోజువారీ గరిష్ట డిమాండ్ 470 మెగావాట్లు ఉంటుందని అంచనా వేశాం.

**ప్రశ్న: నూతన వ్యవసాయ కనెక్షన్ల పరిస్థితి ఏమిటి?**

**జవాబు:** జిల్లాలో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తుల ఆధారంగా కొత్త కనెక్షన్లు ఇస్తున్నాం. వ్యవసాయ కనెక్షన్లకు మెటీరియల్ ఇబ్బంది లేకుండా అగ్రి పోర్టల్‌లో ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నాం. ప్రస్తుతం వ్యవసాయ కొత్త కనెక్షన్ల కోసం 1,434 దరఖాస్తులు వచ్చాయి. సీనియారిటీ ప్రకారం కనెక్షన్లు ఇస్తున్నాం.

**ప్రశ్న: జిల్లాలో మొత్తం విద్యుత్ కనెక్షన్లు ఎన్ని?**

**జవాబు:** జిల్లాలో గృహ విద్యుత్ కనెక్షన్లు 4.84 లక్షలు, వ్యవసాయ కనెక్షన్లు 1.18 లక్షలు, భారీ పరిశ్రమలకు సంబంధించిన కనెక్షన్లు 3,743, కుటీర పరిశ్రమల కనెక్షన్లు 505 మొత్తం 6,81,905 కనెక్షన్లు జిల్లాలో ఉన్నాయి.

**ప్రశ్న: రైతుల కోసం ప్రత్యేక చర్యలేమిటి?**



**జవాబు:** విద్యుత్ ఆధారిత వ్యవసాయం చేసే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు, సమస్యలు వస్తే తక్షణం పరిష్కరించేందుకు 'విద్యుత్ అధికారుల పొలం బాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రైతుల వద్దకు విద్యుత్ అధికారులు వెళ్లి వారి సమస్యను పరిష్కరించడంతోపాటు విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక నిపుణుల బృందంతో అవగాహన కల్పిస్తున్నాం.

# అదిరింది హోలీ









- కోలాహలంగా రంగుల పండుగ
- కేరింతలు కొట్టిన యువత
- ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా సంబురాలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఖమ్మం లకారం వద్ద హోలీ వేడుకల్లో యువత, చిన్నారులు











ఉమ్మడి ఖమ్మం జిల్లాలో హోలీ అదిరింది. రంగుల పండుగను ప్రతి ఒక్కరూ ఎంతో సంబురంగా జరుపుకున్నారు. గురువారం అర్ధరాత్రి కాముడిని దహనం చేసి శుక్రవారం పండుగ చేసుకున్నారు. చిన్నాపెద్ద తేడాలేకుండా ఒకరికొకరు రంగులు పూసుకున్నారు. యువతీ, యువకులు చిందేశారు. కేరింతలు కొట్టారు. ద్విచక్ర వాహనాలపై చక్కర్లు కొట్టారు. ఇక చిన్నారుల ఆనందానికి హద్దుల్లేవు. మహిళలు సైతం రోడ్లెక్కి రంగులు జల్లుకున్నారు. గ్రామగ్రామాన కుల మతాలకు అతీతంగా జరిగిన హోలీ వేడుకలు మనుషుల మధ్య అనుబంధాలు, ప్రేమానురాగాలను ప్రతిబింబించాయి. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సముదాయాలన్నింటికీ సెలవుకావడంతో ఇంటిల్లిపాది వేడుకల్లో మునిగితేలారు. ఆయా ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు సైతం వేడుకల్లో పాల్గొని ఉత్సాహపరిచారు.

–ఖమ్మం/ భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, మార్చి 14

## కొత్త గనులు ఏర్పాటు చేస్తాం

### సింగరేణి డైరెక్టర్ (పా) వెంకటేశ్వర్లు



కొత్తగూడెం సింగరేణి, మార్చి 14: సింగరేణి వ్యాప్తంగా కొత్త బొగ్గు గనుల ఏర్పాటే లక్ష్యంగా పని చేస్తామని నూతన డైరెక్టర్ (పా)గా బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్(పీపీ) కే.వెంకటేశ్వర్లు తెలిపారు. డైరెక్టర్ (పా)గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా హెడ్డాఫీస్‌కు వచ్చిన ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కొత్త గనుల ఏర్పాటులో భాగంగా కొత్తగూడెం ఏరియాలోని వీకే ఓసీ, ఇల్లెందు ఏరియాలోని జేకే ఓసీ విస్తరణ అనుమతుల కోసం ఈసీ (ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్)లో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి, తుది అనుమతుల కోసం కృషి చేస్తున్నామన్నారు. రానున్న రెండు నెలల కాలంలో ఈ రెండు ఓసీలను ప్రారంభించి సంస్థ లక్ష్య సాధనకు కృషి చేస్తామన్నారు. వీటితోపాటు మిగతా ఏరియాల్లో వివిధ దశల్లో ఉన్న నూతన బొగ్గు గనుల అనుమతుల కోసం కృషి చేసి, వాటిని కూడా ప్రారంభించి ఉత్పత్తి లక్ష్య సాధనకు తోడ్పడుతామని ఆయన పేర్కొన్నారు.